# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో


వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 309 మంగళవారం 2 జూలై 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri

# క్యాబినెట్‌లో బీసీలకు చోటేది?

- మంత్రివర్గంలో లోపించిన సామాజిక సమతూకం
- 12 మందిలో ఏడుగురు ఓసీల్లో నలుగురు రెడ్లు
- బీసీ,ఎస్సీ,ఎస్టీలకు దక్కింది ఐదు పదవులే
- మరో ఇద్దరు రెడ్లకు చోటంటూ సంకేతాలు
- రేవంత్ అనుకూలుడికే పీసీసీ అధ్యక్ష పీఠం!

హైదరాబాద్

తెలంగాణ పేరుకు మా త్రమే బలహీనవర్గాల రాష్ట్రం. ఇక్కడ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల జనాభా దాదాపు 80 శాతానికి పైనే ఉన్నా.. పెత్తనం మాత్రం అగ్రవర్ణాలదే. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టు అత్యధిక జనాభా కలిగిన బలహీనవర్గాలకు ప్రభుత్వం లో ప్రాతినిధ్యం కల్పించడంలో ఎప్పుడూ చిన్నచూపేనన్న విమర్శ మొదటినుంచీ ఉన్నది. రేపో, మాపో జరుగబోయే రాష్ట్ర క్యాబినెట్ విస్తరణ నేపథ్యంలో మంత్రివర్గంలో సామాజిక సమతుల్యతపై చర్చ జరుగుతున్నది. జనాభా దామాషా ప్రకారం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో తమకు న్యాయమైన ప్రాతినిధ్యం దక్కడం లేదని బలహీనవర్గాలు వాపోతున్నాయి. బడుగు, బలహీన వర్గాల పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్, రాష్ట్రంలో తమ ప్రభుత్వంలో మాత్రం ఆ వర్గాలకు తగిన భాగస్వామ్యం కల్పించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంబలహీన వర్గాల కంటే అగ్రవర్ణాలకే పెద్దపీట వేసింది. ప్రస్తుత మంత్రిమండలిలో సీఎం రేవంత్‌రెడ్డి సహా 12 మంది ఉండగా, వారిలో ఏడుగురు ఓసీ సామాజిక వర్గాలకు చెందిన వారే ఉన్నారు. బడుగు బలహీనవర్గాలకు చెందిన వారు ఐదుగురు ఉన్నారు. ఏడుగురు ఓసీలలో నలుగురు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు ఉండగా, మిగతా ముగ్గురిలో ఒకరు బ్రాహ్మణ, ఒకరు కమ్మ, మరొకరు వెలమ సామాజిక వర్గాలకు చెందినవారు ఉన్నారు. మిగతా ఐదుగురిలో ఇద్దరు ఎస్సీలు (భట్టి విక్రమార్క, దామోదర రాజనరసింహ), ఇద్దరు బీసీలు (కొండా

- మిగతా 3లో



## ఆలయాలు వాణిజ్య సంస్థలు కాదు

### ఉజ్జయిని మహంకాళి గుడి నిర్వాహకులపై హైకోర్టు ఆక్షేపణ


హైదరాబాద్

దేవాలయాలను వాణిజ్య దృక్కోణంలో నిర్వహించదరాదని హైకోర్టు వ్యాఖ్యానించింది. కొన్ని ఆలయాల నిర్వాహకులు, అధికారులు ఖర్చు ల పేరు చెప్పి ఆదాయమే పరమావధి అన్నట్లుగా ప్రవర్తిస్తున్నారని తీవ్రంగా తప్పుబట్టింది. ఆలయాల నిర్వహణ ప్రభుత్వాల బాధ్యత అని, కానీ వ్యయాలను రాబట్టుకోవాలనే పేరుతో వాటిని వాణిజ్య సంస్థల్లా తయారు చేస్తున్నారని ఆక్షేపించింది. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయ నిర్వాహకుల పనితనం

- మిగతా 3లో

# విస్తరణకు వేళాయె!

- గవర్నర్ రాధాకృష్ణన్‌తో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం
- ఒకట్రెండు రోజుల్లో విస్తరణ అని సమాచారం
- ఈ నెల 5 లోపే కొత్త మంత్రుల ప్రమాణం స్వీకారం!
- నేడో రేపో ఢిల్లీకి రేవంత్.. ఖర్గే, రాహుల్‌తో భేటీ
- మంత్రివర్గ విస్తరణ, టీపీసీసీ చీఫ్‌పై తుది



హైదరాబాద్

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ వ్యవహారం కొలిక్కి వచ్చినట్లే కనిపిస్తోంది. ఈ నెల 5 నుంచి ఆషాఢ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో.. కేబినెట్‌లో కొత్తగా ఎవరెవరికి చోటు కల్పించాలనే విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం ఈ లోపే నిర్ణయం తీసుకుంటుందనే ప్రచారం జరుగుతోంది. కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం కూడా 5వ తేదీలోపే జరుగుతుందని అంటున్నారు. సీఎం రేవంత్ గవర్నర్ రాధాకృష్ణన్‌తో సమావేశం కావడం కూడా ఈ ప్రచారానికి బలం చేకూరుస్తోంది. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి మంగళ, లేదా బుధవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. మంత్రివర్గ విస్తరణ, టీపీసీసీకి కొత్త చీఫ్ నియామకంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీతో చర్చించేందుకే సీఎం ఢిల్లీకి వెళుతున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. సీఎంతోపాటు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క కూడా వెళు తున్నట్లు, ఈ భేటీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ కూడా పాల్గొంటారని చెబుతున్నారు. ఈ భేటీలోనే తుది నిర్ణయం తీసుకునే అవకాశముందని అంటున్నారు. మంత్రివర్గ విస్తరణ, టీపీసీసీ చీఫ్ అంశాలపై కేసీ వేణుగోపాల్‌తో

- మిగతా 3లో

# కుర్చీ దిగేందుకు సిద్ధ మేనా?

- కర్ణాటక కాంగ్రెస్‌లో ముదురుతున్న వర్గపోరు
- డీకేను సీఎం చేయాలంటూ ఒక వర్గం డిమాండ్
- హైకమాండ్ చెప్పింది చేస్తానన్న సిద్ధరామయ్య
- డీకేకు చెక్ పెట్టేలా పావులు కదుపుతున్న సిద్ధూ వర్గం
- బయట మాట్లాడొద్దని చెప్తున్నా వినని ఎమ్మెల్యేలు
- ప్రభుత్వం ఏర్పడ్డ ఏడాదికే తీవ్రమైన 'కుర్చీ' కొట్లాట



# కవిత.. మహిళ అని సానుభూతి చూపలేం!

- బెయిల్ పిటిషన్ తిరస్కరించిన ఢిల్లీ హైకోర్టు
- పలుకుబడి గల మహిళ.. నిస్సహాయురాలిగా భావించలేం
- మద్యం కుంభకోణంలో కవిత బెయిల్ పిటిషన్లను తిరస్కరించిన ఢిల్లీ హైకోర్టు



# రాహుల్ దాడి బీజేపీపైనే, హిందువులపై కాదు

**న్యూఢిల్లీ:** రాహుల్ గాంధీ లోక్‌సభలో చేసిన తొలి ప్రసంగంలోనే హిందువులను కించపరచేలా వ్యాఖ్యలు చేసారంటూ బీజేపీ నేతలు చేస్తున్న ఆరోపణలను కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ (%ాతీఅఖఱఅఝ +ఖఅస్త్రఱ%) తోసిపుచ్చారు. రాహుల్ గాంధీకి మద్దతుగా నిలిచారు. తన సోదరుడు ఎప్పుడూ హిందువులకు వ్యతిరేకంగా మాట్లాడరని, రాహుల్ సైతం ఇదే విషయాన్ని లోక్‌సభలో స్పష్టం చేశారని అన్నారు. కేవలం బీజేపీ, ఆ పార్టీ నాయకుల గురించే రాహుల్ మాట్లాడారని తెలిపారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ ప్రధాని మోదీని, బీజేపీని టార్గెట్ చేసుకొని సోమవారంనాడు విమర్శనాస్త్రాలు సంధించారు. శివుని ఫోటోను చూపిస్తూ, తమని తాము 24 గంటలపాటు హిందువులమని చెప్పుకునేవారిలో హింస, ద్వేషం, అసత్యం పేరుకుపోతోందని బీజేపీని ఉద్దేశిస్తూ విమర్శించారు. హిందూ మతం పేరు చెప్పి బీజేపీ అందరినీ భయపెడుతోందని ఆరోపణలు చేశారు. తమని తాము హిందువులని ప్రచారం చేసుకునేవారు విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, అలాంటి వాళ్లు హిందువులే కారని విమర్శించారు. అసలు హింసని ప్రేరేపించే వాళ్లను హిందువులని ఎలా అనగలమని ప్రశ్నించారు. రాహుల్ వ్యాఖ్యలపై అధికార పార్టీ సభ్యుల నుంచి ప్రతిఘటన ఎదురుకావడంతో తిరిగి రాహుల్ బదులిస్తూ, నరేంద్ర మోదీ ఒక్కరే హిందూ సమాజం కాదని, అలాగే ఆర్ఎస్ఎస్ ఒక్కటే హిందూ సమాజం కాదని చెప్పారు. తాను కేవలం ప్రధాని మోదీని, బీజేపీని, ఆర్ఎస్ఎస్‌ని ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేశానని, మొత్తం హిందూ సమాజాన్ని ఉద్దేశించి కాదని స్పష్టం చేశారు.



# కుర్చీ దిగేందుకు సిద్ధ మేనా?

**బెంగళూరు**

కర్ణాటక కాంగ్రెస్‌లో పవర్ పాలిటిక్స్ తారస్థాయికి చేరుకున్నాయి. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదికే సీఎం కుర్చీ కోసం కొట్లాట ముదురుతున్నది. పార్టీ ఇచ్చిన వార్నింగ్‌లను లెక్కచేయకుండా ఎమ్మెల్యేలు బాహాటంగానే తమ డిమాండ్లు వినిపిస్తున్నారు. సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా కొనసాగేలా చూసేందుకు ఆయన వర్గం ఎమ్మెల్యేలు, డీకే శివకుమార్‌ను సీఎంను చేసేందుకు ఆయన వర్గీయులు పావులు కదుపుతున్నారు. ఈ మొత్తం తతంగాన్ని సిద్ధరామయ్య, డీకే శివకుమార్ తెరవెనుక నుండి నడిపిస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది.

**50:50 ఫార్ములా పాటిస్తారా ?**

గత ఏడాది మే నెలలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. అప్పుడు కూడా ముఖ్యమంత్రి పదవి కోసం పీఠముడి నెలకొన్నది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఇద్దరూ కుర్చీ కోసం తీవ్రంగా పోటీ పడ్డారు. చివరకు సిద్ధరామయ్యనే అదృష్టం వరించింది. అయితే, అప్పుడు ముఖ్యమంత్రి పదవిని మొదటి రెండున్నరేండ్లు సిద్ధరామయ్యకు, తర్వాతి రెండున్నరేండ్లు డీకే శివకుమార్‌కు ఇచ్చేలా ఒప్పందం జరిగిందనే ప్రచారం జరిగింది. ఈ ఒప్పందం నిజమే అయితే మరో ఏడాదిన్నరలో ముఖ్యమంత్రి మార్పు ఉండనుంది. అందుకే, ఇప్పటి నుంచి సిద్ధరామయ్య, డీకే వర్గాలు పదవి కోసం పావులు కదుపుతున్నట్టు తెలుస్తున్నది. ముఖ్యంగా, ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోయేందుకు సిద్ధరామయ్య సిద్ధంగా ఉన్నారా? అనేది ఇప్పుడు చర్చనీయాంశమైంది.

**సిద్ధరామయ్య దిగిపోవాలి**

సిద్ధరామయ్య ముఖ్యమంత్రి పదవిని వదులుకొని డీకే శివకుమార్‌ను అప్పగించాలనే డిమాండ్లు పెరిగాయి. ఇటీవల సీఎం పదవి నుంచి తప్పుకొని డీకే శివకుమార్‌కు ఇవ్వాలని విశ్వ ఒక్కలిగ మహాసంస్థాన మఠానికి చెందిన చంద్రశేఖర స్వామి నేరుగా సిద్ధరామయ్యనే కోరారు. చెన్నగిరి ఎమ్మెల్యే శివగంగ బసవరాజ్ కూడా ఇదే డిమాండ్ చేస్తున్నారు. డీకే శివకుమార్ వల్లే కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిందని, ఆయనను ముఖ్యమంత్రిని చేయాలని ఆయన పదేపదే కోరుతున్నారు. డీకే శివకుమార్ క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేశారని, ఆయన సీఎం కావాలని అంటున్నారు. ఏడాదిన్నరలో ముఖ్యమంత్రి మార్పు ఉంటుందని డీకే వర్గీయులు ఈ డిమాండ్లను తెరపైకి తెచ్చారనే ప్రచారం జరుగుతున్నది.

**ఇప్పటి నుంచే డీకేకు చెక్**

ఇదే సమయంలో డీకే శివకుమార్‌కు చెక్ పెట్టేందుకు కాంగ్రెస్‌లోనే ప్రయత్నాలు తీవ్రమయ్యాయి. డీకే తన పీసీసీ అధ్యక్ష పదవిని వదులుకోవాలని కొందరు నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పుడు డీకే ఒక్కరే ఉప ముఖ్యమంత్రిగా ఉండగా, మరో ముగ్గురిని కూడా ఉపముఖ్యమంత్రులను చేయాలని మంత్రి రాజన్న సహా మరికొందరు కోరుతున్నారు. ముఖ్యమంత్రి మార్పు ఉండకుండా చూసేందుకు డీకేకు ఇప్పటినుంచే చెక్ పెట్టేలా సిద్ధరామయ్య వర్గం ఈ డిమాండ్లు తెర మీదకు తెచ్చిందనే ప్రచారం జరుగుతున్నది. ముఖ్యమంత్రి పదవి విషయమై కాంగ్రెస్ అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకున్నా తాము పాటిస్తామని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య సోమవారం ప్రకటించారు. డీకే శివకుమార్ కూడా హైకమాండ్ చెప్పిందే ఫైనల్ అంటున్నారు.



# కవిత.. మహిళ అని సానుభూతి చూపలేం!




**న్యూఢిల్లీ :** ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో అరెస్టయి తిహాడ్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మరోసారి చుక్కెదురైంది. ఈడీ, సీబీఐ కేసులకు సంబంధించి ఆమె పెట్టుకున్న బెయిల్ పిటిషన్లను ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది. మహిళ అనే కారణంతో కవితపై సానుభూతి చూపలేమని కోర్టు స్పష్టం చేసింది. ఒక విద్యావంతురాలిగా పలుకుబడి కలిగిన మహిళగా ఆమె చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన విషయాన్ని గుర్తుంచుకోవాలని వ్యాఖ్యానించింది. ఈ రీత్యా కేసులో ఆమె పాత్ర, ఆమెకు వ్యతిరేకంగా ఉన్న సాక్ష్యాల ఆధారంగానే బెయిల్ ఇవ్వాలో లేదో నిర్ణయించాలే తప్ప మహిళ అన్న విషయానికి అంత ప్రాధాన్యం ఉండకూడదని కోర్టు అభిప్రాయపడింది. ఢిల్లీలో కొత్త మద్యం విధానం కుంభకోణం ప్రధాన కుట్రదారుల్లో కవిత కూడా ఒకరని ఈడీ సేకరించిన సాక్ష్యాలను బట్టి తేలిందని, ఈ కేసులో మరికొందరు నిందితులు కూడా ఆమె తరఫునే పనిచేశారని, ఫలితంగా ఆమెను ఓ నిస్సహాయ మహిళగా భావించలేమని కోర్టు స్పష్టం చేసింది. కేసుకు సంబంధించి సమన్లు ఇచ్చిన తర్వాతే ఫోన్లు పార్మట్ చేశారని, ఫలితంగా కవిత సాక్ష్యాలను చెరిపేసినట్లు అనుమానాలున్నాయని వ్యాఖ్యానించింది. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో మనీలాండరింగ్‌కు సంబంధించి ఎమ్మెల్సీ కవితకు వ్యతిరేకంగా బలమైన ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నాయని, ఈ దశలో ఆమెకు బెయిల్ మంజూరు చేయలేమని తీర్పులో స్పష్టం చేసింది. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో కవితను మార్చి 15న హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో ఈడీ అరెస్టు చేసింది. 16న ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో హాజరు పరిచింది. కవిత తిహాడ్ జైల్లో ఉండగానే ఏప్రిల్ 11న సీబీఐ అరెస్టు చేసినట్లు ప్రకటించింది. తొలుత.. తన కుమారుడికి పరీక్షలున్నాయని మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరగా ట్రయల్ కోర్టు తిరస్కరించింది. తర్వాత ఈడీ, సీబీఐ కేసుల్లో తనకు సాధారణ బెయిల్ మంజూరు చేయాలని కవిత పిటిషన్లు దాఖలు చేయగా ట్రయల్ కోర్టు మరోసారి తిరస్కరించింది. ఈ నేపథ్యంలో ఆమె ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. బెయిల్ మంజూరు చేయాలని ఈడీ, సీబీఐ కేసుల్లో వేర్వేరు పిటిషన్లు దాఖలు చేయగా 2 పిటిషన్లు కలిపి ఢిల్లీ ఉన్నత న్యాయస్థానంలో ఒకేసారి విచారించింది. మే 27, 28 తేదీల్లో హైకోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. ఢిల్లీ మద్యం కేసుతో కవితకు సంబంధమే లేదని, అక్రమంగా అరెస్టు చేశాయని ఆమె తరఫు న్యాయవాదులు కోర్టులో వాదనలు వినిపించారు. అయితే, ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కవితది కీలకపాత్రని, ఆమె సూత్రదారి, పాత్రదారి అని దర్యాప్తు సంస్థలు బలంగా వాదించాయి. వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తి స్వర్ణకాంత శర్మ తీర్పును రిజర్వ్ చేశారు. జూన్‌లో హైకోర్టులో సెలవులు ఉండడంతో ఈలోపే తీర్పు వెల్లడించాలని కవిత తరఫు న్యాయవాది కోరారు. సెలవులకు ముందే తీర్పు ఇస్తానని న్యాయమూర్తి చెప్పినప్పటికీ సెలవులు ముగిసిన తర్వాత సోమవారం తీర్పు ఇచ్చారు. ఈడీ, సీబీఐ రెండు కేసుల్లోనూ బెయిల్ పిటిషన్లు తిరస్కరిస్తున్నట్లు తన తీర్పులో న్యాయమూర్తి వెల్లడించారు.

**నేరానికి పాల్పడలేదని నిర్ధారణకు రాలేకపోతున్నాం**

ఢిల్లీ మద్యం విధానం కేసులో ఈడీ సమర్పించిన సాక్ష్యాధారాలు, సెక్షన్ 250 కింద సాక్షుల వాంగ్మూలాలు, సీఆర్పీసీ 144 కింద అప్రూవర్ల వాంగ్మూలాలు, వాట్సాప్ చాటింగ్‌లతోపాటు అనేక డాక్యుమెంటరీ సాక్ష్యాలు ఉన్నరీత్యా ఆమె నేరానికి పాల్పడలేదని కోర్టు నిర్ధారణకు రాలేకపోతోందని హైకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ స్వర్ణకాంత శర్మ తన తీర్పులో పేర్కొన్నారు. మనీలాండరింగ్ లోని సెక్షన్ 45 కింద ఆమెకు బెయిల్ ఇవ్వడానికి కారణాలేమీ లేవని చెప్పారు. తాను సమర్పించిన 9 మొబైల్ ఫోన్లను ఎవరు ఫార్మట్ చేశారన్న విషయంపై కవిత స్పష్టమైన వివరణ ఇవ్వలేదని, గత 2023 మార్చి 11న సమన్లు పంపిన తర్వాతే ఈ ఫోన్లను ఫార్మాట్ చేయడాన్ని బట్టి చూస్తే ఆమె సాక్ష్యాధారాలను చెరిపివేసినట్లు అనుమానాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు. ఫలితంగా ఇప్పుడు బెయిల్‌పై విడుదల చేస్తే ఆమె మరిన్ని సాక్ష్యాలను చెరిపివేసే అవకాశం ఉన్నదని, అంతేకాక ఈ కేసులో పలువురు కీలక సాక్షులు ఆమె సన్నిహిత సహచరులు లేదా ఉద్యోగులు కావడాన్ని విస్మరించలేమని కోర్టు పేర్కొంది. ఆమె సమాజంలో పలుకుబడి కలిగిన మహిళ అని, రాజకీయాల్లో కూడా ఆమె అనుభవజ్ఞురాలని, ఈ రీత్యా ఆమె సాక్షులను ప్రభావితం చేయలేరని చెప్పలేమన్నారు. మద్యం కుంభకోణంలో దర్యాప్తు అత్యంత కీలకదశలో ఉన్నదని, తుది చార్జిషీట్లను దాఖలు చేయవలసి ఉన్నదని కోర్టు పేర్కొంది.

## రాహుల్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం



**న్యూఢిల్లీ :** మోదీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోమవారం లోక్‌సభలో విమర్శనాస్త్రాలు సంధించారు. ఈ నేపథ్యంలో రాహుల్ విమర్శలపై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ న్యూఢిల్లీలో విలేకర్ల సమావేశంలో స్పందించారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయన్నారు. ప్రతిపక్ష నేత పదవి చాలా బాధ్యతతో కూడుకున్నదని ఆయన పేర్కొన్నారు. అలాంటి పదవిని తొలిసారిగా చేపట్టిన రాహుల్ గాంధీ ఇటువంటి బాధ్యతారాహిత్యమైన వ్యాఖ్యలు చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. అగ్నివీరుల పథకాన్ని ప్రవేశపెట్టిన బీజేపీ ప్రభుత్వంపై రాహుల్ చేసిన ఆరోపణలను ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఖండించారు. అగ్నివీరులను వాడుకొని వదిలేసే కార్మికులగా ఆయన అభివర్ణించారన్నారు. అలాగే ఈ పథకంలో చేరిన వారిలో.. ఒకరు పెన్షన్ అందుకుంటారు. మరొకరు అందుకోరంటూ ఆయన విమర్శలు చేశారని గుర్తు చేశారు. అంతేకాదు జవాన్ల మధ్య విభజన సృష్టిస్తున్నారంటూ రాహుల్ పేర్కొన్నారని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరించారు. అయితే అగ్నివీరుల పథకంపై సభలో కాంగ్రెస్ పార్టీ చాలా సార్లు ఇలా విమర్శలు గుప్పించిందన్నారు. వారి విమర్శలకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి పలుమార్లు సరైన సమాధానమిచ్చారన్నారు. అయినా రాజ్యాంగ పదవులపై ఈ తరహా వ్యాఖ్యలు చేయడం సబబు కాదని ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నేతలకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ హితవు పలికారు. ఇక ఈ రోజు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. మొత్తం హిందూ సమాజం హింసాత్మకమైనదే కాకుండా అసత్యమైనదన్నట్లు వ్యాఖ్యానించారని ఆయన వివరించారు. రాహుల్ చేసిన ఈ వ్యాఖ్యలతో.. తన ప్రతిపక్ష హోదా స్థాయిని తగ్గించారన్నారు. రాహుల్ ఈ తరహా ప్రకటనపై దేశవ్యాప్తంగా విచారం వ్యక్తమవుతుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు.

## రూ.200తో అంతరిక్షయానం!

**భారతీయులకు యూఎస్ స్పేస్ ఏజెన్సీ ఆఫర్**




**న్యూఢిల్లీ :** కేవలం రూ.200 చెల్లించి (2.5 డాలర్లు) పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవటం ద్వారా అంతరిక్షంలో అడుగుపెట్టే అవకాశాన్ని పొందొచ్చు. రాకేశ్‌శర్మ తర్వాత అంతరిక్షంలోకి వెళ్లిన రెండో భారతీయుడిగా చరిత్ర సృష్టించవచ్చు. ఇది నిజం! అమెరికాకు చెందిన 'అంతరిక్ష అన్వేషణ, పరిశోధన ఏజెన్సీ' (సెరా) భారతీయులకు అద్భుతమైన ఆఫర్ ప్రకటించింది. వివిధ దేశాలకు చెందిన ఆరుగురు పౌరులను వ్యోమగాములుగా తీర్చిదిద్ది%ొ% అంతరిక్షంలో పంపేందుకు సెరా మానవ సహిత 'స్పేస్ ఫ్లైట్ ప్రోగ్రాం'ను చేపట్టింది. 'బ్లూ ఆరిజన్' కంపెనీ (అమెరికా బిలియనీర్ జెఫ్ బెజోస్‌కు చెందినది) తయారుచేసిన 'న్యూ షెపర్డ్ రాకెట్' ద్వారా వ్యోమగాముల్ని అంతరిక్షంలోకి పంపనున్నది. ఇందుకు సంబంధించి వ్యోమగాముల ఎంపిక మొదలైందని, భారత పౌరసత్వం ఉన్న పౌరులెవ్వరైనా దరఖాస్తు చేసుకోవచ్చునని 'సెరా' తెలిపింది. ఆగస్టులో రిజిస్ట్రేషన్ ఉంటుందని, రూ.200 చెల్లిస్తే సరిపోతుందని ప్రకటించింది. అనంతరం పబ్లిక్ వోటింగ్, మూడు దశల్లో 'ఎలిమినేషన్'తో భారత్ ప్రతినిధిగా ఒకరిని వ్యోమగామిగా ఎంపిక చేస్తారు. రాకెట్ ద్వారా వ్యోమగాముల్ని భూమి నుంచి 100 కిలోమీటర్ల ఎత్తులో ఉండే అంతరిక్షంలోకి తీసుకెళ్తారు. అక్కడ వారు 11 నిమిషాలపాటు గడిపేందుకు అవకాశముంటుంది.

## నన్ను టార్గెట్ చేయడంతోనే 63 మంది ఎంపీలు ఓడారు..

**బీజేపీపై విరుచుకుపడిన మహువా మొయిత్రా**



**ఢిల్లీ:** తనను టార్గెట్ చేసి సభ నుంచి బహిష్కరించినందుకే లోక్ సభలో బీజేపీకి 63 మంది సభ్యుల బలం తగ్గిందని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా దుయ్యబట్టారు. పార్లమెంటు ఎన్నికల్లో గెలిచి మళ్లీ సభలో అడుగుపెట్టిన ఆమె.. పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా మాట్లాడుతూ.. తనను టార్గెట్ చేయడంతో కాషాయ పార్టీ భారీ మూల్యం చెల్లించుకుందన్నారు. "లోక్ సభలో ఎన్నికలకు ముందు నన్ను ఇక్కడ మాట్లాడనివ్వలేదు. అధికార పార్టీ ఒక ఎంపీ గొంతు నొక్కినందుకు మూల్యం చెల్లించుకుంది. నన్ను అణచివేసే ప్రయత్నంలో 63మంది బీజేపీ ఎంపీలను ఇంట్లో కూర్చోబెట్టారు. వారు నన్ను మౌనంగా ఉంచాలని చూశారు. కానీ ప్రజలు వారిని నిశ్శబ్దం చేశారు" అని మొయిత్రా ధిక్కార స్వరంతో అన్నారు. కేంద్రంలో రెండు ప్రాంతీయ పార్టీలపై ఆధారపడి బీజేపీ అధికారం చేపట్టిందని.. ఏదో ఒక రోజు సంకీర్ణ ప్రభుత్వం కూలిపోతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు.


**ఎందుకు బహిష్కరించారంటే..**

లోక్‌సభలో ప్రశ్నలు అడిగేందుకు పారిశ్రామికవేత్త హీరానందాని నుంచి మొయిత్రా డబ్బులు, కానుకలు తీసుకున్నారని, ఆమె పార్లమెంట్ వివరాలను దుబాయి నుంచి యాక్సెస్ చేశారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఈ వివాదంపై ఎథిక్స్ కమిటీ విచారణ చేపట్టింది. అనైతిక ప్రవర్తనతో సభా ధిక్కరణకు పాల్పడినట్లు గుర్తించి రిపోర్ట్ ఇచ్చింది. దీంతో స్పీకర్ ఆమెను పార్లమెంటు సమావేశాల నుంచి బహిష్కరించారు. అప్పటి నుంచి మొయిత్రా పార్లమెంటు సమావేశాలకు దూరమయ్యారు. ఈ మధ్యే జరిగిన లోక్ సభ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కృష్ణానగర్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి అమృతా రాయ్‌పై విజయం సాధించి మరోమారు పార్లమెంటులో అడుగు పెట్టారు.

## మెషీన్ లెర్నింగ్, పైథాన్‌దే హవా


**ఈ ఏడాది జాబ్ మార్కెట్‌ను శాసించే ఏఐ స్కిల్స్ ఇవే**

**'ఇండీడ్' సర్వేలో వెల్లడి**




**న్యూఢిల్లీ :** ఈ ఏడాది జాబ్ మార్కెట్‌ను శాసించే కృత్రిమ మేథ (ఏఐ) నైపుణ్యాలపై అమెరికాకు చెందిన ఎంప్లాయ్‌మెంట్ వెబ్‌సైట్ 'ఇండీడ్' తాజాగా సర్వే నిర్వహించింది. ఏఐ జాబ్స్‌కు అవసరమయ్యే టాప్-15 ఏఐ నైపుణ్యాల్ని నివేదిక వెల్లడించింది. 42శాతం కంపెనీలు మెషిన్ లెర్నింగ్, 40 శాతం యాజమాన్యాలు పైథాన్ స్కిల్స్‌ను అభ్యర్థుల్లో ఉండాలని కోరాయి. ఏఐ (36), కమ్యూనికేషన్ స్కిల్స్ (23), నేచురల్ ల్యాంగ్వేజ్ ప్రాసెసింగ్(20), టెన్సార్ ఫ్లో (19), డాటా సైన్స్(17), ఏడబ్ల్యూఎస్(14), డీప్ లెర్నింగ్(14), జావా(11), అజ్యూర్(11), ఇమేజ్ ప్రాసెసింగ్(10), ఎస్‌క్యూఎల్(10), పైటార్చ్(9), అజైల్(8) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఏఐ వల్ల రాబోయే కాలంలో మరిన్ని ఉద్యోగాలు కొత్తగా వస్తాయని 85శాతం కంపెనీలు అంచనా వేస్తున్నాయని నివేదిక పేర్కొన్నది. 'ఏఐ నైపుణ్యాల్ని పెంచుకోవటంపై భారత్ మరింత దృష్టి సారించాలి. ఉద్యోగులు ఏఐ స్కిల్స్ పొందటంలో కంపెనీలు వారికి సహకారం అందించాలి' అని ఇండీడ్ ఇండియా సేల్స్ హెడ్ శశికుమార్ అన్నారు. భారత్‌లో ఏఐ మార్కెట్ 2027 నాటికి 17 బిలియన్ డాలర్లకు (రూ.1.4 లక్షల కోట్లు) చేరుకుంటుందని నాస్కామ్, బీసీజీ అంచనావేస్తున్నాయి. ఏటా 25 నుంచి 35శాతం వృద్ధి ఈ రంగంలో ఉంటుందని చెబుతున్నాయి. ఈ అంచనాలు నిజమవ్వాలంటే, భారతీయ కంపెనీలు ఏఐ స్కిల్స్‌ను గుర్తించాల్సి వుంది. దానికి అనుగుణంగా నియామకాలు చేపట్టాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

# క్యాబినెట్‌లో బీసీలకు చోటేది?



-మొదటిపేజీ తరువాయి

సురేఖ, పొన్నం ప్రభాకర్), ఎస్టీ (సీతక్క) ఉన్నారు.

**విస్తరణలోనైనా న్యాయం జరిగేనా?**

రేపో, మాపో జరుగుతుందని భావిస్తున్న మంత్రివర్గ విస్తరణలోనూ తమకు న్యాయమైన వాటా దక్కుతుందన్న గ్యారెంటీ లేదని బడుగు, బలహీనవర్గాలకు చెందిన నాయకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి దామోదర రాజనరసింహా కథనం ప్రకారం మంత్రివర్గ విస్తరణలో నలుగురికి చోటు కల్పించనుండగా వీరిలో ఇద్దరు రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారికి, మరో ఇద్దరు బీసీలకు అవకాశం ఉంటుందని తెలిసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి పీ సుదర్శన్‌రెడ్డికి చోటు కల్పించబోతున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ లెక్కన ప్రస్తుతం ఉన్న నలుగురు 'రెడ్డి' మంత్రుల సంఖ్య ఆరుకు చేరుకోనుండగా, ఓసీ మంత్రుల సంఖ్య తొమ్మిదికి చేరుకోనుంది. మరో ఇద్దరు బీసీలు.. వాకిటి శ్రీహరి (మక్తల్), దానం నాగేందర్ (హైదరాబాద్)కు కూడా మంత్రి పదవులు దక్కుతాయని మంత్రి పేర్కొన్నారు. అప్పుడు బీసీ మంత్రుల సంఖ్య నాలుగుకు చేరుకోనుంది. మంత్రి దామోదర రాజనరసింహ చెప్పిందే నిజమైతే రాష్ట్ర మంత్రిమండలిలో అగ్రకులాల వారికే పెద్దపీట దక్కనుంది. దీంతో మంత్రివర్గ విస్తరణలోనూ సామాజిక సమతుల్యం లోపించినట్టు అవుతుందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

**అధికారం లేని పీసీసీ అంటగట్టే ప్రయత్నం**

బీసీలకు మంత్రివర్గంలో సరైన ప్రాతినిధ్యం లభించలేదనే విమర్శలను అధిగమించేందుకుగాను ఆ సామాజికవర్గానికి పీసీసీ అధ్యక్ష పీఠం కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పార్టీ అధ్యక్ష పదవికి పెద్దగా ప్రాధాన్యం ఉండదు. అధికారమంతా సీఎం చేతిలోనే ఉంటుంది. పార్టీ అధ్యక్షుడు మరో పవర్ సెంటర్ కాకుండా ఉండేందుకు సీఎం రేవంత్‌రెడ్డి తనకు అనుకూలమైన వ్యక్తికే ఈ పదవిని కట్టబెట్టేలా పావులు కదుపుతున్నారు. పీసీసీకి కొత్త అధ్యక్షునిగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ పేరును సీఎం ప్రతిపాదించినట్టు సమాచారం. ఏదైనా కారణంగా మహేశ్‌కుమార్‌గౌడ్‌కు బాధ్యతలు అప్పగించలేనిపక్షంలో మహబూబాబాద్ ఎంపీ బల్‌రాంనాయక్ పేరును కూడా రేవంత్‌రెడ్డి సూచించినట్టు చెప్తున్నారు. తమ దృష్టిలో వీరిద్దరూ డమ్మీ అభ్యర్థులేనని పార్టీ సీనియర్ నాయకుడు ఒకరు వ్యాఖ్యానించడం గమనార్హం.

# రాజగోపాల్‌రెడ్డికీ మంత్రి పదవి!

- దానం నాగేందర్‌కు దక్కే చాన్స్
- సీతక్కకు హోంశాఖ: దామోదర
- మంత్రివర్గంలోకి లగడపాటి, దానం
- నిజామాబాద్ నుంచి ఒకరికి చాన్స్
- పలువురు మంత్రుల శాఖలు మార్పు
- త్వరలో వైద్యారోగ్యశాఖ ప్రక్షాళన
- వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర



**హైదరాబాద్ :** ఫిరాయింపుదారులకు మంత్రి పదవి ఇవ్వబోమని, కాంగ్రెస్ బీ-ఫారంపై గెలిచిన వారికే పదవి ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు కదా?.. అని మంత్రి దామోదర రాజనర్సింహను విలేకరులు ప్రశ్నించగా.., ఎప్పటికీ ఒకేలా ఉంటుందా? అని సమాధానం ఇచ్చినట్టు తెలిసింది. కాలాన్ని బట్టి రాజకీయాలు మారుతూ ఉంటాయని అన్నారట !

రాష్ట్ర హోం శాఖ బాధ్యతలను త్వరలో మంత్రి సీతక్కకు అప్పగించనున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా పేర్కొన్నట్టు సమాచారం. మంత్రి సోమవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి ఫిరాయించిన దానం నాగేందర్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంటారని చెప్పినట్టు తెలిసింది. నిజామాబాద్ జిల్లా నుంచి కూడా ఒకరికి మంత్రి పదవి దక్కనున్నదని పేర్కొన్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అంతేకాదు.. ఇప్పుడు ఉన్న పలువురు మంత్రుల శాఖలు మారబోతున్నాయని చెప్పినట్టు సమాచారం. అయితే.. ఫిరాయింపుదారులకు మంత్రి పదవి ఇవ్వబోమని, కాంగ్రెస్ బీ-ఫారంపై గెలిచిన వారికే పదవి ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు కదా?.. అని ప్రశ్నించగా, ఎప్పటికీ ఒకేలా ఉంటుందా? అని సమాధానం ఇచ్చినట్టు తెలిసింది. కాలాన్ని బట్టి రాజకీయాలు మారుతూ ఉంటాయని అన్నారట. 2018లో రాహుల్ గాంధీ స్వయంగా ప్యారాచూట్ నేతలకు టికెట్లు ఇవ్వబోమని చెప్పారని, అది అమలు కాలేదు కదా? అనేక మంది ప్యారాచూట్ నేతలకు టికెట్లు ఇవ్వాల్సి వచ్చింది కదా అని ఉదహరించినట్టు సమాచారం.

**వైద్యారోగ్యశాఖ ప్రక్షాళన**

వైద్యారోగ్య శాఖలో త్వరలో భారీ ప్రక్షాళన చేయనున్నట్టు మంత్రి చెప్పినట్టు సమాచారం. ప్రస్తుతం వైద్యారోగ్యశాఖలో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డీపీహెచ్) పరిధిలో ప్రాథమిక వైద్యం, తెలంగాణ వైద్యవిధాన పరిషత్తు(టీవీవీపీ) ఆధ్వర్యంలో సీహెచ్‌సీలు, ఏరియా దవాఖానలు, డీఎంఈ పరిధిలో మెడికల్ కాలేజీలు, జిల్లా దవాఖానలు కొనసాగుతున్నాయి. ఈ వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తంగా ఉన్నదని మంత్రి పేర్కొన్నారట. టీవీవీపీని, డీపీహెచ్‌ను కలిపి కొత్త వ్యవస్థ ఏర్పాటు చేసేలా ఆలోచిస్తున్నామని చెప్పారట. తద్వారా భవిష్యత్తులో వైద్యవిద్యకు డీఎంఈ, ఆరోగ్య సేవలకు హెల్త్ డైరెక్టరేట్ మాత్రమే ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్టు వెల్లడించారని సమాచారం. త్వరలోనే అమలు చేస్తామని అన్నట్టు తెలిసింది. 'కేంద్రం నిర్వహించే ఏ పరీక్ష అయినా నిర్వహించే శక్తి రాష్ట్రానికి కూడా ఉన్నది. నీట్‌ను రద్దు చేయాలా? కేంద్రం నిర్వహించాలా? రాష్ట్రాలకు ఇవ్వాలా? అనే అంశంపై ఆరోగ్యకరమైన చర్చ జరగాలి. ఉస్మానియా, గాంధీ, కాకతీయ మెడికల్ కాలేజీల్లో హాస్టళ్ల భవనాలకు పది రోజుల్లో శంకుస్థాపన చేసి, రెండేండ్లలో నిర్మాణం పూర్తి చేస్తాం. కొత్త మెడికల్ కాలేజీలకు ఇంకా అనుమతులు రావాల్సి ఉన్నది' అన్నట్టు సమాచారం.

# విపత్తు నిర్వహణ విభాగం ఇక హైడ్రా..

**హైదరాబాద్ :** ఇప్పటివరకు జీహెచ్‌ఎంసీలో భాగంగా ఉన్న విపత్తుల నిర్వహణ విభాగాన్ని ఒక ప్రత్యేక వ్యవస్థగా విస్తరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. దానికి హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్(హైడ్రా)గా నామకరణం చేశారు. హైడ్రా పరిధిని కూడా అవుటర్ రింగ్ రోడ్డు లోపలి భాగం మొత్తానికి విస్తరించారు. అంటే, జీహెచ్‌ఎంసీతో పాటు ఓఆర్ఆర్ లోపల ఉన్న 27 మున్సిపాలిటీలు, 33 గ్రామాలు హైడ్రా పరిధిలోకి వస్తాయి. అంతేకాకుండా డీఐజీ స్థాయి అధికారి హైడ్రాకు డైరెక్టర్‌గా వ్యవహరిస్తారు. ఎస్పీ స్థాయి అధికారులు అడిషనల్ డైరెక్టర్లుగా ఉంటారు. హైడ్రా కేవలం వరదలో, ఇతర విపత్తులో వచ్చినపుడే రంగంలోకి దిగడం కాకుండా వాటికి కారణం అవుతున్న మూల సమస్యల మీద కూడా దృష్టి సారిస్తుంది. అంటే, చెరువులు, నాలాల ఆక్రమణలపై ఎప్పటికప్పుడు కన్నేసి ఉంచుతుంది. బ్రాండ్ హైదరాబాద్ విషయంలో పట్టుదలగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరదలు, ఇతర విపత్తులపై సోమవారం సాయంత్రం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. పురపాలక శాఖ, హెచ్‌ఎండీఏ, మూసీ అభివృద్ధి సంస్థ అధికారులు ఇందులో పాల్గొన్నారు. హైదరాబాద్ భౌగోళిక పరిధి వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో విపత్తుల నిర్వహణ విభాగం పరిధిని కనీసం అవుటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించాలని సీఎం స్పష్టం చేశారు. హైడ్రాలో కేవలం ప్రొటెక్షన్ ఫోర్స్ మాత్రమే కాకుండా జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, వాటర్ బోర్డు, సిటీ ట్రాఫిక్, తదితర విభాగాల నుంచి ప్రత్యేక బృందాలను నియమించాలని చెప్పారు. హైడ్రాలో సిబ్బంది సంఖ్య, విధులు, నిధుల కేటాయింపు, ఇతర బాధ్యతలపై ముసాయిదా సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు. కేవలం వరదలు, ప్రమాదాలప్పుడే కాకుండా 365 రోజులూ ఈ విభాగం పనిచేస్తూ ఉండాలని చెప్పారు. మహానగరంలో ప్రజలు ఎదుర్కొనే అన్ని సమస్యల పరిష్కారంలో 'హైడ్రా' క్రియాశీలంగా వ్యవహరించాలని సీఎం స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా వ్యవస్థాగత మార్పులతో పాటు, బాధ్యతల పంపిణీ జరగాలని చెప్పారు.

**ఆక్రమణలకు అడ్డుకట్ట**

జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న చెరువులు, కుంటలను పరిరక్షించడంతో పాటు నగరంలోని నాలాలు, ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణలకు గురి కాకుండా కాపాడే కీలక బాధ్యతలను హైడ్రా చేపట్టాలని నిర్ణయించారు. హోర్డింగులు, ఫ్లెక్సీల నియంత్రణ, తాగునీటి పైపులైన్లు, విద్యుత్ సరఫరా లైన్లు, డ్రైనేజీలు, వరద నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ వ్యవహారాలన్నింటిలోనూ ఈ విభాగం సేవలను అందించాలని ముఖ్యమంత్రి చెప్పారు. మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్ట్ హైదరాబాద్ సిటీకి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చేలా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలన్నారు.

**చారిత్రాక కట్టడాల పునరుద్ధరణకు చర్యలు**

నగరంలోని చారిత్రక ప్రాధాన్య కట్టడాలు, శిథిలమైన నిర్మాణాలను పునరుద్ధరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. సిటీ లైబ్రరీ, చార్మినార్ సమీపంలోని యునానీ ఆస్పత్రి, నిజామియా అబ్జర్వేటరీ, గుడిమల్కాపూర్ కోనేరులపై జీహెచ్‌ఎంసీ పవర్ పాయింట్ ప్రజంటేషన్లు ప్రదర్శించింది. వాటిని పర్యాటకంగా అభివృద్ధి చే సేందుకు మార్గాలను అన్వేషించాలని సీఎం సూచించారు. వీటిలో మూసీ అభివృద్ధి ప్రాజెక్టులో కలిపే అవకాశం ఉన్నవి గుర్తించి, జోడించాలని చెప్పారు.

**నేడు శాఖల ముఖ్య కార్యదర్శులతో సీఎం సమావేశం!**

అపరిష్కృతంగా ఉన్న విభజన సమస్యల మీద ఏపీ సీఎం చంద్రబాబుతో 6న భేటీ ఉన్న నేపథ్యంలో మంగళవారం అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులతో సీఎం రేవంత్ సమావేశం కానున్నట్లు తెలిసింది. ఇరు రాష్ట్రాల మధ్య ప్రధానంగా ఉన్న విభజన సమస్యలు.. వాటి పరిష్కారానికి ఉన్న అవకాశాలు.. ఆ మేరకు చేయాల్సిన ప్రతిపాదనలపై ముఖ్య కార్యదర్శులతో రేవంత్ చర్చించనున్నట్లు తెలిసింది. విభజన సమయంలో ఇరు రాష్ట్రాలకు చెందిన పలు శాఖల భూములు, ఆస్తులను కేంద్రం విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10లోకి చేర్చింది. ఆ భూములు, ఆస్తులపై ఇప్పటికీ ఇరు ప్రభుత్వాలు ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నాయి. వీటిలో హౌసింగ్ బోర్డు, డెక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హోల్డింగ్ లిమిటెడ్(దిల్) భూములున్నాయి. దిల్‌కు ఏపీలోని విశాఖపట్నంలోనూ కొంత భూమి ఉంది. దీనిపై మొదటినుంచీ వివాదం నడుస్తోంది. ఇక కృష్ణా, గోదావరి నదీ జలాల విషయంలో ఇరు రాష్ట్రాల మధ్య పలు వివాదాలున్నాయి. రెండు రాష్ట్రాల విద్యుత్తు బకాయిలు, ఉద్యోగుల బదిలీల సమస్యలూ ఉన్నాయి. పోలవరం బ్యాక్ వాటర్ విషయంలోనూ పలు సమస్యలున్నాయి. వీటన్నింటినీ ఏపీతో ఎలా పరిష్కరించుకోవాలి? అనే విషయాన్ని రేవంత్ చర్చించనున్నట్లు తెలుస్తోంది. అలాగే భద్రాచలం దగ్గర ఏపీలోకి వెళ్లిన 5గ్రామాలను వెనక్కి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

## విస్తరణకు వేళాయె!

-మొదటిపేజీ తరువాయి

సీఎం రేవంత్, భట్టివిక్రమార్క, ఉత్తమ్, దీపాదాస్ మున్షీ ఇప్పటికే రెండు దఫాలు సమావేశమై చర్చించిన విషయం తెలిసిందే.

**ప్రతిపాదిత పేర్లపై అభిప్రాయ సేకరణ..**

పీసీసీ కొత్త చీఫ్ కోసం ఎమ్మెల్సీ మహేషకుమార్‌గౌడ్, ఎంపీ బలరాం నాయక్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ తదితరుల పేర్లపై చర్చించి షార్ట్ లిస్ట్ చేశారు. ఇక మంత్రివర్గ విస్తరణకు సంబంధించి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, ముదిరాజ్ సామాజికవర్గం నుంచి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్‌రావు, ఎడ్మ బొజ్జు, నల్లగొండ జిల్లా నుంచి ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బాలు నాయక్ తదితరుల పేర్లపై కేసీ వేణుగోపాల్‌తో జరిగిన భేటీల్లో చర్చించారు. ఆ సమావేశాల తర్వాత హైదరాబాద్‌కు వచ్చిన దీపాదాస్ మున్షీ.. రాష్ట్రంలోని పలువురు ముఖ్యనేతలను కలిసి టీపీసీసీ కొత్త చీఫ్‌గా ప్రతిపాదిత పేర్లపై అభిప్రాయాలు సేకరించారు. కేసీ వేణుగోపాల్‌తో జరిపిన చర్చలు, రాష్ట్ర ముఖ్యనేతల అభిప్రాయాల ఆధారంగా ఖర్గే, రాహుల్.. టీపీసీసీకి కొత్త చీఫ్, మంత్రివర్గ విస్తరణపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా.. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ టూర్‌లో ఈ నియామకాలపై చర్చలు జరిపిన నేపథ్యంలో ఆశావహులంతా ఆ నాలుగు రోజులూ ఢిల్లీలోనే మకాం వేశారు. అధిష్ఠానంతో మరోసారి భేటీ జరగనుండడంతో వారంతా మళ్లీ ఢిల్లీకి చేరుకుంటున్నారు.

**గవర్నర్‌తో సీఎం రేవంత్ భేటీ..**

సీఎం రేవంత్ సోమవారం గవర్నర్ రాధాకృష్ణన్‌తో భేటీ అయ్యారు. మంత్రివర్గ విస్తరణపై ఒకటి, రెండు రోజుల్లో నిర్ణయం జరగనుందని, ఆషాఢం లోపే వారితో ప్రమాణ స్వీకారం చేయించాలనీ గవర్నర్‌ను సీఎం కోరినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఖాళీగా ఉన్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ సీట్లకు టీజేఎస్ అధినేత కోదండరాం, మీడియా రంగం నుంచి అమీరుల్లాఖాన్ పేర్లను సిఫారసు చేస్తూ మంత్రిమండలి గతంలో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ సిఫారసుకు ఆమోదం తెలిపే అంశంపైనా గవర్నర్‌తో సీఎం చర్చించినట్లు తెలుస్తోంది.

## అంతర్గతంగా బడుల రేషనలైజేషన్

**బదిలీ అయిన వారిని రిలీవ్ చేయని విద్యాశాఖ**

**రాష్ట్రంలో 25,036 మంది ఎస్జీటీల బదిలీ**



**హైదరాబాద్ :** లేదు లేదంటూనే పాఠశాల విద్యాశాఖ బడుల రేషనలైజేషన్‌ను అమలుచేసింది. రేషనలైజేషన్ ప్రకారమే టీచర్లను బదిలీచేసింది. దీంతో పలు స్కూళ్లకు టీచర్లను కేటాయించలేదు. విద్యార్థుల సంఖ్యలేని పలు పాఠశాలల్లోని పోస్టులను పక్కనపెట్టింది. కాగా, విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న స్కూళ్లల్లో బదిలీ అయినా టీచర్లను రిలీవ్ చేయలేదు. పాత స్థానాల్లోనే ఉండాలని సూచించింది. దీంతో సంవత్సరాలుగా ఒకేచోట పనిచేస్తూ తాజాగా బదిలీ కాగా, ఈ నిర్ణయంతో వారి ఆనందం క్షణాల్లోనే ఆవిరైంది. దీనిని పలు ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకించాయి. బదిలీ అయిన వారిని రిలీవ్‌చేయాలని డిమాండ్ చేశాయి.

**బదిలీపొందిన వారిని రిలీవ్‌చేయాలి: తపస్**

బదిలీఅయిన టీచర్లందరిని వెంటనే రిలీవ్ చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) డిమాండ్ చేసింది. అవసరమైతే విద్యావలంటీర్లను నియమించాలని రాష్ట్ర అధ్యక్షుడు కే హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేశ్ కోరారు. చాలా మందిని రిలీవ్ చేయకపోవడంతో ఎస్జీటీలు ఎక్కడివారు అక్కడే ఉండే పరిస్థితి నెలకొన్నదని వాపోయారు. యూపీఎస్‌లోని ఎస్జీటీ పండితులను సైతం రిలీవ్‌చేయాలని సూచించారు.

**రిలీవ్‌చేయాలని టీఆర్‌టీఎఫ్ నిరసనలు**

బదిలీ అయిన టీచర్లను రిలీవ్‌చేయాలని డిమాండ్‌చేస్తూ తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్టీఎఫ్) సోమవారం రాష్ట్రవ్యాప్తంగా నల్లబ్యాడ్జీలతో నిరసనలు చేపట్టింది. అంతర్గత రేషనలైజేషన్ వల్ల విద్యార్థులకు గుణాత్మకమైన విద్య దూరమవుతుందని అధ్యక్షుడు కటకం రమేశ్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. ప్రతి పాఠశాలను తెరవాలన్న హామీని సీఎం రేవంత్‌రెడ్డి అమలుచేయాలని డిమాండ్ చేశారు.

**50శాతం ఎస్జీటీల బదిలీలు**

రాష్ట్రంలో 50,808 మంది ఎస్జీటీలు(సెకండరీ గ్రేడ్ టీచర్లు) పని చేస్తుండగా, సోమవారం 25,036 మంది బదిలీ అయ్యారు. అంటే 50శాతం టీచర్లకు స్థానచలనం కలిగింది. ఇక రంగారెడ్డి జిల్లాలో 955 మంది స్కూల్ అసిస్టెంట్లు స్థానం చలనం పొందారు. ఇక సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తారు. ఆ తర్వాత సెకండరీ గ్రేడ్ టీచర్లను బదిలీ చేస్తారు. దీంతో రాష్ట్రంలో టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రి య ముగుస్తుంది.

## ఆలయాలు వాణిజ్య సంస్థలు కాదు



-మొదటిపేజీ తరువాయి

చూసిన తర్వాత ఆలయాలు వ్యాపార కేంద్రాలుగా మారిపోయాయా? అన్న అనుమానం కలుగుతోందని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ఈ ఆలయానికి చీరెలు, జాకెట్లు, కొబ్బరికాయలు సేకరించేందుకు ఎన్. నవీన్‌కుమార్ అనే వ్యక్తికి టెండర్ ఉంది. కొవిడ్‌వల్ల నష్టపోయిన కాలానికిగాను అందరు కాంట్రాక్టర్లకు 292 రోజుల పాటు లీజు గడువు పొడిగించాలని దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి 2021లో నోటిఫికేషన్ జారీచేశారు. అయితే దీనిని పట్టించుకోకుండా మహంకాళి ఆలయ ఈవో కొత్త టెండర్‌కు నోటిఫికేషన్ ఇచ్చారు. దీంతో పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో లీజు గడువు పొడిగించాలని హైకోర్టు ఆదేశాలిచ్చింది.

చిట్కుల్ చెరువులో చేపల మృతిపై నోటీసులు

పటాన్‌చెరువు పరిధిలోని చిట్కుల్ చెరువులో టన్నులకొద్దీ చేపలు చనిపోవడంపై పత్రికల్లో వచ్చిన కథనాలను హైకోర్టు సుమోటోగా స్వీకరించింది. వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు నోటీసులు జారీచేస్తూ విచారణను ఈనెల 16కు వాయిదా వేసింది. మరోవైపు జంతులపై క్రూరత్వ నిరోధక చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయడంలేదని అందిన లేఖను హైకోర్టు సుమోటోగా స్వీకరించింది. ప్రభుత్వానికి నోటీసులు జారీచేస్తూ విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

# భావితరాలకు చరిత్రను చాటి చెప్పేల స్మృతి వనం





**రాష్ట్ర పంచాయతి రాజ్, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క**

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** భావితరాలకు చైత్రను చాటి చెప్పేలో స్మృతి వనం నిర్మిస్తామని మంత్రి సీతక్క అన్నారు. కోటి రూపాయల వ్యయంతో ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపం నిర్మాణానికి ఆమె సోమవారం భూమి పూజ చేశారు. ముందుగా ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని రామలింగంపల్లి గ్రామం నుండి శ్యామ్ నాయక్ తాండ వరకు రూ .3 కోట్ల 75 లక్షల వ్యయం తో చేపట్టిన తారు రోడ్డు, వాగు పై నిర్మించిన వంతెనను ప్రారంభించారు. ఏజెన్సీ పరిధిలోని గిరిజన గ్రామాల ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రతి గూడానికి రహదారి సౌకర్యం కల్పించి వారి సమస్యలు తీరుస్తామని మంత్రి ఆన్నారు. అనంతరం ఇంద్రవెల్లి అమరవీరుల స్మారక స్థూపం వద్ద నివాళులర్పించి కోటి రూపాయల వ్యయంతో స్మృతి వనం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఇంద్రవెల్లి అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. జిల్లాలో పచ్చదనానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆన్నారు. మావల అర్బన్ పార్క్ లో ఏర్పాటు చేసిన వన మహోత్సవం కార్యక్రమం లో భాగంగా మొక్కలు నాటి వన మహోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. వనం బాగుంటే జనం బాగుంటారని, ఆరోగ్యం, ఆనందం ఉంటుందని, అందుకే మొక్కలను నాటాలని ఆన్నారు. అదిలాబాద్ పట్టణం



నకు అర్బన్ పార్క్ 1500 ఎకరాలలో ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. మావల పార్కు నందు జిల్లా విపత్తు నిర్వహణ బృందం డిడిఆర్ఎఫ్ (డిస్ట్రిక్ట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) ను ప్రారంభించారు. జిల్లాలో ఎలాంటి ఆపత్కాల సమయంలో విపత్తులు జరిగినప్పుడు అత్యవసరంగా స్పందించేందుకు జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ప్రత్యేక చొరవతో ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా డిడిఆర్ఎఫ్ బృందానికి సంబంధించినటువంటి రెస్క్యూబోట్, మోటర్ మిషన్స్, మెడికల్ స్ట్రక్చర్స్, లైఫ్ జాకెట్స్, లైఫ్ బాయ్స్, వుడ్ కట్టర్ మిషన్స్ వాటిని ప్రారంభించారు. జిల్లాలో ఎలాంటి ఆపత్కాల సమయంలోనైనా ప్రజలను త్వరగా కాపాడే విధంగా, ప్రాణ నష్టం వాటిల్లకుండా జిల్లాలో సొంతంగా డిడిఆర్ఎఫ్ (డిస్టిక్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) పోలీసు సిబ్బంది ద్వారా ఏర్పాటు చేయడం సంతోషకరమని మంత్రి పేర్కొన్నారు. జిల్లాలో డిడిఆర్ఎఫ్ నిర్వహిస్తున్న 20 మంది పోలీసు సిబ్బంది అందరికీ అభినందనలు తెలియజేశారు. ప్రమాదాల నుండి ప్రజలను కాపాడటమే మీ లక్ష్యంగా విధులను నిర్వర్తించాలని అదేవిధంగా మీ ప్రాణాలను కాపాడుకుంటూ ప్రజల ప్రాణాలను కాపాడాలని సూచించారు. పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరిస్తూ, చాకచక్యంగా ఆలోచిస్తూ, బృందంలో ఒకరితో ఒకరు కలిసికట్టుగా విధులను నిర్వర్తిస్తూ విపత్తులలో శిక్షణను దృష్టిలో ఉంచుకొని ప్రజల ప్రాణాలను కాపాడాలని సూచించారు. మంత్రి వెంట జిల్లా పాలనాధికారి రాజర్షి షా, ఎస్పీ పోలీస్ గౌస్ ఆలం, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, ఆదిలాబాద్ , ఖానాపూర్ ఎమ్మెల్యే లు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు, తదితరులు ఉన్నారు.

# అశోక్ నగర్ 28వ డివిజన్‌లో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ





**వాస్తవ నేస్తం,అనంతపురం:** ఎన్టీఆర్ భరోసా కార్యక్రమం పేద ప్రజల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతుంది అని 28వ డివిజన్ అధ్యక్షులు రామాంజనేయులు, అనంతపురం పార్లమెంటు తెలుగు యువత అధికార ప్రతినిధి వెంకట రామయ్య లు అన్నారు. ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ పథకాన్ని సోమవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్ నగర్ అమ్మవారి చెరువు కట్ట నందు 28వ డివిజన్ అధ్యక్షుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఎన్టీఆర్ భరోసా రూ. 3వేల పెన్షన్ ని, రూ.4 వెలకు పెంచి ఏప్రిల్, మే,జూన్ నెలలకు పెంచిన ఒక్క వెయ్యి కలిపి జూలైలో రూ.7000 ఇవ్వడం జరిగింది అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ నగర అధ్యక్షులు మనోహర్, తెలుగుదేశం యువ నాయకులు షేక్షావలి,తలారి శివ,ఈశ్వరయ్య, తలారి నాగలింగం, డివిజన్లో అవ్వ తాత లు అక్క చెల్లెమ్మలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలి

**వెంట వెంటనే పరిష్కరించాలి..**

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్ :** ప్రజావాణిలో 370 దరఖాస్తుల స్వీకరణ ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి జిల్లా కలెక్టర్, అధికారులతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలన్నారు. అలాగే హైదరాబాద్ నుంచి వచ్చే ప్రజా దర్బార్ కు సంబంధించిన దరఖాస్తులను క్లియర్ చేయాలని సూచించారు. ప్రజావాణి, ప్రజా దర్బార్ దరఖాస్తులను పెండింగ్లో పెట్టవద్దని పేర్కొన్నారు. ప్రజావాణికి మొత్తం 370 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కరీంనగర్ మున్సిపల్ కార్యాలయానికి 50, డిపిఓ కార్యాలయానికి 26, పోలీస్ కమిషనర్ కార్యాలయానికి 13, కరీంనగర్ ఆర్డీవో కార్యాలయానికి 16, హుజురాబాద్ ఆర్డీవో కార్యాలయానికి 11, ఎస్ఈ ఎన్పీడీసీఎల్ కార్యాలయానికి 16, మానకొండూర్ తహసిల్దార్ కార్యాలయానికి 18, కరీంనగర్ రూరల్ కార్యాలయానికి 14, వీణవంకలో 13, తిమ్మాపూర్ 11, కొత్తపెల్లి తహసీల్దార్ కార్యాలయానికి 10 దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ధరణి పెండింగ్ దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలి. ధరణి పెండింగ్ దరఖాస్తులను తహసిల్దార్లు యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. తహసిల్దార్ లాగిన్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో 100% పూర్తి చేయాలని, వీటి పై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని పేర్కొన్నారు. ఒక అప్లికేషన్ పెండింగ్లో ఉండవద్దని పేర్కొన్నారు.

**ఎంబీ రికార్డులు పూర్తి చేయండి.**

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులకు సంబంధించిన ఎంబీ రికార్డులను ఇంజనీరింగ్ అధికారులు వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు దాదాపు పూర్తి అయ్యాయని తెలిపారు. వీటికి సంబంధించిన ఎంబి రికార్డులు వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. రికార్డులు పూర్తి చేస్తేనే బిల్లులు మంజూరు అవుతాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బూట్లు త్వరలో అందిస్తామని చెప్పారు. ఇందుకు సంబంధించిన మెజర్మెంట్లు పక్కగా తీసుకోవాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మి కిరణ్, డీఆర్ఓ పీ పవన్ కుమార్, కరీంనగర్, మానకొండూర్ ఆర్డీవోలు కే మహేశ్వర్, రమేష్ బాబు, కలెక్టరేట్ ఏవో సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు యూనిఫామ్స్, స్కూల్ బ్యాగ్స్ పంపిణీ



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు హెట్రో యాజమాన్యం బ్యాక్స్, యూనిఫామ్ లు పంపిణీ చేశారు. ఇట్టి కార్యక్రమంలో జిన్నారం ఎంపీపీ రవీందర్ గౌడ్, హెట్టిరో ప్రతినిధులతో కలసి విద్యార్థిని విద్యార్థులకు అందజేశారు. ఎంపీపీ రవీందర్ గౌడ్ మాట్లాడుతూ.. హెటీలో యాజమాన్యం పంపిణీ చేస్తున్న స్కూల్ బ్యాగ్స్ యూనిఫామ్ అందించడం అభినందనీయమని, ప్రభుత్వ పాఠశాలలో ఇలాంటి సదుపాయాలు ఉన్న ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పాఠశాలలను మరింత అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. ఎంపీపీ సహకారంతో న్యూ ల్యాండ్ యాజమాన్య సంస్థ ప్రభుత్వ పాఠశాలకు ప్రొజెక్టర్ స్క్రీన్ అడిగిన వెంటనే యాజమాన్యం పంపించినందుకు జిన్నారం ఎంపీటీసీ లావణ్య నరేష్ న్యూ ల్యాండ్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెటీరో యాజమాన్య ప్రతినిధులు భాస్కర్, ప్రధానోపాధ్యాయులు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు యనగండ్ల నరేందర్, కాంగ్రెస్ పార్టీ మండల సెక్రెటరీ పల్నాటి భాస్కర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్రవల్లి ప్రవీణ్, తౌరి వినోద్, విష్ణుమూర్తి, మ్యదారి ప్రవీణ్, ఎస్ఎంసి మాజీ చైర్మన్ భాస్కర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** వావిలాల గ్రామ హై స్కూల్ 1995-1996 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన గురువులను శాలువాలతో సత్కరించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. 28 సంవత్సరాల తర్వాత మన ఉపాధ్యాయులతో కలిసి కార్యక్రమంలో పాల్గొనడం చిన్ననాటి చదువుకున్న రోజులను గుర్తు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## టిపిసిసి అధ్యక్షులుగా జగ్గారెడ్డిని నియమించాలి

**- కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి చిన్న ముదిరాజ్**



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** సంగారెడ్డి జిల్లాలోని తెలంగాణా రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులుగా సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ని నియమించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి చిన్న ముదిరాజ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గానికి మెడికల్ కాలేజీ తీసుకురావడంతో పాటు ఎంతో అభివృద్ధికి జగ్గారెడ్డి రెడ్డి కృషి చేశారని తెలిపారు. 10 సంవత్సరాలు కేసీఆర్ ప్రభుత్వంలో ఎన్నో ఇబ్బందులు పెట్టిన జైలుకు పంపించిన కాంగ్రెస్ పార్టీని కాంగ్రెస్ కార్యకర్తలను వీడకుండా కాంగ్రెస్ అధికార రావడానికి తన వంతు కృషి చేసిన జగ్గారెడ్డిని పిసిసి ప్రెసిడెంట్ చేయాలని అన్నారు.

## హైదరాబాద్ ఎంపీ ఇంటిపైన దాడిని తీవ్రంగా ఖండించిన అట్ల సాహు



**వాస్తవ నేస్తం,మహబూబ్ నగర్:** హైదరాబాద్ ఎంపీ ఏఐఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసి అధికార నివాసం ఢిల్లీలో గుర్తు తెలియని వ్యక్తులు దాడి ని ఏఐఎంఐఎం పార్టీ నేత, మహబూబ్ నగర్ పార్లమెంట్ ఇంచార్జ్ అట్ల సాహు ఖండించారు. మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రజా ప్రతినిధుల పైన కక్ష సాధింపు బెదిరింపులకు పాలుపడుతున్న ఎన్డీఏ ప్రభుత్వం భౌతిక దాడులకు భయపడేది లేదు అన్నారు. ప్రజల పక్షాన ఒవైసీ కేంద్రం పైన పోరాటానికి బడుగు బలహీన వర్గాల ప్రజలకు వారికీ సంపూర్ణగా మద్దతు ఉంటుందని సాహు అన్నారు. దాడి జరిగి మూడు రోజులు గడుస్తున్నా ఇప్పటికి దుండగులను అరెస్ట్ ఎందుకు చెయ్యలేరు అని మండిపడ్డారు. దాడికి పాల్పడిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చెయ్యాలని ఢిల్లీ పోలీస్ లను డిమాండ్ చేసారు.

## సిద్దిపేట సాగు నీటి కల సాకారం అయింది మీ హయాంలోనె

**మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**

**సిద్దిపేట :** చరిత్ర లో నిలిచే పనులు ఎన్నో చేసిన ఘనత మీకె దక్కుతుంది. పదవులు శాశ్వతం కాదు. ప్రజా సేవా ఎల్లప్పుడూ ఉంటుందని చిన్నకూడూర్ మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం లో పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు.హరీష్ రావు మాట్లాడుతూ చిన్నకోడూరు మండల పరిషత్ చివరి సర్వ సభ్యసమావేశం జరుపుకుంటున్నాం. మీరందరూ గత 5 సంవత్సరాలుగా కష్టపడి ప్రజలకు మీ సేవలను అందించారు. సర్పంచ్ లు ఎంపీటీసీ లు కలిసి చాల గ్రామాల్లో సమన్వయంతో పని చేశారు. కాళేశ్వరం నీళ్లను రైతులకు రెండు పంటలకు అందించిన గొప్ప అవకాశం మీ హయాంలో మీకు దొరికింది. ఎన్నో అభివృద్ధి పనులు చేస్తుంటాం. కానీ సాగునీరు మనకు జీవన ఆధారం. జీవన గతిని, పల్లెల ముఖ చిత్రాన్ని మార్చేది సాగు నీరు. అలాంటి సాగునీరు మీ ఈ అయిదేళ్ల కాలంలో రైతులకు అందడం మీ అదృష్టం. గ్రామాల్లో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా కొన్ని పాఠశాలలు బాగుచేసుకున్నాం.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com

స్థానిక వార్తలు

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com